పనుల గుర్తింపునకు గ్రామసభ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల గుర్తింపునకు ఖండ్రుమ్ పంచాయతీ కేంద్రంలో స్థానిక ఆ పంచాయతీ సర్పంచ్ కే.హరి ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులు మట్టి కట్టలు, భూమి చదును, రాతి కట్టలు, ఖండిత కంద కాలువ పనులకు తీర్మానం చేసినట్లు సర్పంచ్ హరి తెలిపారు. అనంతరం ఆ పంచాయతీలో పనిచేస్తూ బదిలీ అయిన సచివాలయ కార్యదర్శి గోవిందరావును సచి వాలయ సిబ్బంది, నాయకులు, వార్డు సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, ఉప సర్పంచ్ కె ప్రతిమ ,మాజీ సర్పంచ్ కిలో ఆనంద్, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, పాలక వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శిని సత్కరిస్తున్న సర్పంచ్, నేతలు

ఆదివాసీ మహిళను దూషించిన

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ర్యాలీ చేపడుతున్న ఆదివాసీ గిరిజన మహిళా సంఘం నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట:అల్లూరి జిల్లా పాడేరు విద్యాశాఖ కార్యాలయంలో ఆదివాసీ మహిళ మొస్య సుజాతను కులం పేరుతో దూషించి ఆగ్రహావేశాలతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎడి, జూనియర్ అసిస్టెంట్లను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి డిమాండ్ చేశారు. మండలంలో సోమవారం నిరసన చేపట్టారు. దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని నినాదాలు చేశారు.గిరిజన మహిళలపై చిన్నచూపు చూస్తే ఆదివాసి గిరిజన మహిళ సంఘం చూస్తూ ఊరుకోదన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు.

దౌర్జన్యం చేయడం సరికాదు: ఆదివాసీ గిరిజన సంఘం

అరకులోయ రూరల్:అల్లూరి జిల్లా పాడేరు విద్యాశాఖ కార్యాలయంలో ఆదివాసీ మహిళ మొస్య సుజాతను కులం పేరుతో దూషించి ఆగ్రహావేశాలతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎడి, జూనియర్ అసిస్టెంట్లను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, జిల్లా ఉపాధ్యక్షులు గత్తుం బుజ్జిబాబు, గురుమూర్తి, నానిబాబు డిమాండ్ చేశారు.అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో జిల్లా బాలదేవ్ మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కోడ్ కారణంగా సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయుడు తెలగంజి దేవదాస్ విషయమై జిల్లా కలెక్టర్, డిఈఓ సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ తన భర్త ఉపాధ్యాయుడు దేవదాస్ సస్పెన్షన్ జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆదివాసీ మహిళా మొస్య సుజాత ప్రశ్నించిందన్నారు. దీనిపై జిల్లా విద్యా శాఖ ఏడి వినయ్ మోహన్, సినియర్ అసిస్టెంట్లు వినీల్ వీరబాబు ఆగ్రహావేశాలతో ఆదివాసీ మహిళను కులం పేరుతో దూషించి అసభ్యకరమైన పదజాలంతో ఆఫీసు నుండి బయటకు నెట్టేశారన్నారు. అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న బాలదేవ్

బాలికతో ఇంటి పనులు చేయిస్తున్న..

మనోహర్‌పై కేసు నమోదు చేయాలి

-పోలీసులకు పిఒ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు:హుకుంపేట మండలం దొంతురాయి గ్రామానికి చెందిన ప్రమీల కుమార్తె మైనర్ బాలికని రాజమండ్రి తరలించి ఇంటిలో పనులు చేయిస్తున్న శెట్టి మనోహర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్ పేర్కొన్నారు. గిరిజన బాలికలను అక్రమంగా తరలించి పనులు చేయిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆయన సోమవారం ఆదేశించారు. ఐసిడిఎస్ పి.డి. ఎన్. సూర్యలక్ష్మి అందించిన వివరాల మేరకు మోక్షిత దేవి దొంతురాయి గ్రామం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. రెండు నెలల క్రితం మనోహర్ బాలికలను వెంట తీసుకుని వెళ్లి రాజమండ్రిలోని తన ఇంట్లో చాకిరీ చేయించడంతో బాలిక తప్పించుకుని గోదావరి వంతెనపై నడిచి వెళ్లడం గమనించిన ఒక వ్యక్తి తీసుకుని వెళ్లి రాజమండ్రిలో పోలీసులకు అప్పగించారని అన్నారు. రాజమండ్రి పోలీసులు అందించిన సమాచారం మేరకు రంపచోడవరం సిడిపిఓ సంధ్యారాణి, అడ్డతీగల సిడిపిఓ సుధ రాజమండ్రి పంపించామన్నారు. సిడిపిఓలు బాలికలను తీసుకుని వచ్చి పాడేరు ఐసిడిఎస్ పి.డి. సూర్యలక్ష్మికి శనివారం అప్పగించారు. సోమవారం బాలికలను ఐసిడిఎస్ అధికారులను ఐటిడి ఏ కు పిలిపించి ప్రాజెక్టు అధికారి బాలికతో మాట్లాడి రాజమండ్రి ఎందుకు వెళ్లావు, ఎలా వెళ్లావు, ఎలా తప్పించుకుని బయట పడ్డావని వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఇంటికి వెళ్లడానికి నిరాకరించడంతో బాలల సదనంలో చేర్పించాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. వెంటనే బాలికకు కొత్తబట్టలు కొని ఇచ్చి ఐసిడిఎస్ అధికారుల బాలల సదనంలో చేర్పించి విద్యను అందించాలని ఆదేశించారు. స్థానిక సి.ఐ.తో ఫోన్లో మాట్లాడి బాల కార్మిక చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖపట్నం వైల్డ్ వెలోర్ కమిటీ అధ్యక్షులతో మాట్లాడి బాలికను బాలల సదనంలో చేర్పించడానికి అనుమతులు జారీ చేయాలని కోరారు. రెండు నెలలుగా బాలిక పాఠశాలకు గైరుహాజరైనా పట్టించుకోని దొంతురాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డి.ఇ.ఓ బ్రహ్మాజీని ఆదేశించారు. రెండు రోజులు విద్యార్థులు పాఠశాలలకు రాకపోతే వెంటనే సమాచారం తెలుకుని ఉన్నాతాధికారులకు తెలియజేయాలని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సర్క్యులర్ జారీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి ఉప సంచాలకులు బ్రహ్మాజీ, ఐసిడిఏస్ సూపర్వైజర్ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం ఇస్తున్న కలెక్టర్

డిస్కస్ త్రోలో బంగారు పతకం సాధించిన

సింహాచలంను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: డిస్కస్ త్రోలో బంగారు పథకం సాధించిన ఇంటర్మీడియట్ విదార్థి వంతల సింహాచలంను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అభినందించారు. ఇటీవల రాజమండ్రి లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో డిస్కస్ త్రో విభాగంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విదార్థి మొదటి స్థానం, షార్ట్ పుట్‌లో మూడవ స్థానం సాధించి బంగారు, రజత పథకాలను పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, కోచ్ జి.మన్మధరావు తో జిల్లా కలెక్టర్‌ను కలిసిన విద్యార్థిని రెండు అథ్లెటిక్ పోటీలలో గెలుపొందినందుకు కలెక్టర్ అభినందిస్తూ, జాతీయ స్థాయిలో కూడా మంచి నైపుణ్యం ప్రదర్శించి మొదటి స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ఈ నెల17 నుండి 19 వరకు గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సౌత్ జోన్ నేషనల్ మీట్‌లో సింహాచలం పాల్గొననున్నారు. స్థానిక పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న సింహాచలం స్వగ్రామం ముంచింగిపుట్టు మండలం వలజంగి గ్రామం.

శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి , ఎంపీపీలు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని వాలసీ పంచాయతీ పరిధి గొర్రెగుమ్మి గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సేంబి సన్యాసిరావు ఆధ్వర్యన సోమవారం స్దానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న 24 పంచాయతీ పరిధి గ్రామాల అభివృద్ధికి జిల్లా, మండల మండల పరిషత్ నిధులు కేటాయించి అభివృద్ధి కృషి చేస్తున్నమన్నారు. పియర్ డిపార్ట్మెంట్ రూ 30 లక్షల నిధులతో వాలసి మెయిన్ రోడ్డు నుండి గొర్రెగుమ్మి గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దూరు గంగన్న దొర, మాజీ సర్పంచ్ ధర్మన్న, టిడిపి మండల అధ్యక్షులు టి.బుజ్జిబాబు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ చేస్తున్న గ్రామ వాలంటీర్లు

ఉద్యోగ భద్రత కల్పించాలని వాలంటీర్ల ర్యాలీ

- పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి -ఎటపాక

గ్రామ వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ఏపీ గ్రామ/వార్డు వాలంటీర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన వాలంటీర్లు ఎటపాకలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు పి కొండబాబు, బి వినోద్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చామని, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేశామని, కానీ కనీస వేతనం, పని గంటలు, పని విధానం లేకుండా వెట్టి చాకిరీ చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలో టిడిపి కూటమి నాయకులు వాలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10వేలు కనీస వేతనం చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడిచినా హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. తక్షణమే ఎన్నికల హామీలు అమలు చేయాలని, రాజీనామా చేసిన వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, ఎన్నికల నాటి నుండి నేటి వరకు నాలుగు నెలల పెండింగ్ వేతనం రూ.10వేలు చొప్పున రూ.40వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు జి హరనాథ్, కార్యదర్శి దేగల మాధవరావు, నాయకులు తోట శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పిఒతో పాటు సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఐటీడిఎ ఏపీఓ డిఎన్‌బి.రమణ తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి 43 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజ్, డిఎల్‌పిఓ రఘునందన్, వెలుగు ఏపిడి దేగలయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, డాక్టర్ ఇందిరా, డియల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బయ్య, డిటిలు శ్రీధర్, స్వామి, రవీంద్రబాబు, బి.రాజు, త్రిమూర్తులు, ఉపాధి హామీ ఎపిడి జి.శ్రీనివాసరావు, పిహెచ్ఓ చిట్టిబాబు, పిఏఓఎల్ రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజేంద్ర బాబు, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు, డాక్టర్ డేవిడ్, ఎంపీహెచ్ఓలు పీటర్, రాజు, డిడి ఆఫీస్ సూపరింటెండెంట్ బి.కిషోర్, ఏఈపి వెంకటరమణ, లీగల్ సెల్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాద బీమా పాలసీ నమోదు చేస్తున్న దృశ్యం

పోస్టాఫీసులో ప్రమాద బీమా నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

18 ఏళ్ల నుండి 65 సంవత్సరాలు వయస్సు కలిగిన వారందరూ ప్రమాద బీమా పాలసీ నమోదు చేసుకోవాలని ఇందుకూరు బ్రాంచ్ పోస్టల్ బీపీఎం, పి.ఎ.కొండలరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇందుకూరు గ్రామంలో ఉన్న బ్రాంచ్ పోస్టాఫీస్‌లో ప్రమాద బీమా పాలసీ నమోదు కార్యక్రమంలో సోమవారం జరిగింది. ఎనిమిది మంది ప్రమాద బీమా పాలసీ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ.555తో ప్రమాద బీమా పాలసీ నమోదు చేసుకుంటే ప్రమాదం జరిగినప్పుడు శాశ్వత వైకల్యం, అంగచ్ఛేదం పక్షవాతం వచ్చినా, మృతి చెందినా నామినీ అకౌంట్‌కు రూ.10 లక్షలు జమ చేయటం జరుగుతుందని చెప్పారు. సంవత్సరానికి ఒక వ్యక్తి రూ.355తో ప్రమాద బీమా పాలసీ నమోదు చేసుకుంటే ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు, శాశ్వత వైకల్యం జరిగితే రూ.10 లక్షలు నామినీ అకౌంట్‌లో జమ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ బీమా పాలసీ నమోదు చేయదల్చిన వారి ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్, ఆధార్ కార్డ్‌కి లింక్ అయిన ఫోన్ నెంబర్ తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యలగాడ నాగేశ్వరరావు, తెల్లం శేఖర్, కారం రామన్న దొర, మురదా బాపామణి, కానూరి రామకృష్ణ, టెంకి రాంబాబు, ములపర్తి ఈశ్వర్ దొర, రెల్లి భవానీ శంకర్, మేక సత్యం, ఈరేటి సుధాకర్, కొట్టెం లక్ష్మణ్, టెంకి శ్రీను, కానూరి గోర్రాజు, యరబండి ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-సీలేరు : ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు సమస్యలపై సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్ రామభద్రరాజుకు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రీజనల్ కార్యదర్శి భాస్కరరావు మాట్లాడుతూ సిబ్బంది కొరత ఉండడంతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలో నూతనంగా కాంట్రాక్ట్ కార్మికులను నియామకం జరిపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఏపీ జెన్కో పరిధి కాలనీలో చెత్త డంపింగ్ చేస్తున్న కార్మికుల పని దినాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెలుగురి కృష్ణ, నడిగుట్ల వరప్రసాద్, కార్మికులు పి.వరహాలు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పాలనలో హామీల అమలు ఏదీ?

-మాజీ శాసనసభ సభ్యురాలు భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - చింతపల్లి : అధికారమే లక్ష్యంగా అమలు సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విధానాలపై 100 రోజులలోనే ప్రజలు విసుగెత్తి ఉన్నారని పాడేరు మాజీ శాసన సభ్యురాలు, వైకాపా ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం చింతపల్లి వచ్చిన ఆమె స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవితో కలిసి మాట్లాడుతూ, మతోన్మాద బిజెపితో జతకట్టిన జనసేన, తెలుగుదేశం పార్టీల కుయుక్తులను రాష్ట్ర ప్రజలు కేవలం 100 రోజులలోనే తెలుసుకున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వంద రోజులలోనే అమలు పరుస్తామని చెప్పిన తెదేపా అధికారంలోకి వచ్చి కేవలం పెన్షన్ పెంపు తప్ప మిగిలిన హామీలను విస్మరించారన్నారు. అర్హత లేని వారికి పెన్షన్ తొలగిస్తామని ఎన్డీఏ ప్రభుత్వం చెప్పడాన్ని ఆమె తప్పు పట్టారు. ఆనాడు అర్హత ఉండి పెన్షన్ పొందలేని ఎంతోమందికి సదరం ధ్రువీకరణ పత్రాలు అందించి అర్హత కల్పించి పెన్షన్ అందించడం జరిగిందన్నారు.అర్హత లేని వారికి పెన్షన్ తొలగిస్తామని చెప్పడంలో ఈ ప్రభుత్వ ఆంతర్యం ఏమిటని ఆమె ప్రశ్నించారు. వాలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. వాలంటీర్ వ్యవస్థ లేకపోవడం తుపాను సమయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పి ఆ దిశగా ఆలోచన చేయ లేదన్నారు. వాలంటీర్లుగా పనిచేసిన వారందరికీ నేడు దిశా నిర్దేశం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ధర్నా చేస్తామన్న ప్రతిసారి వాలంటీర్ల కోసం ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పుకొస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మాట్లాడుతున్న జిసిసి మేనేజర్

కాఫీకి గిట్టుబాటు ధర

-జిసిసి మేనేజర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు గ్రామపంచాయతీ గడుగుపల్లి గ్రామంలో కాఫీ రైతులకు అవగాహన సదస్సును సోమేలి లక్ష్మయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జిసిసి ఎంఎస్ మేనేజర్ బుక్క వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు అకౌంటెంట్ సుగంధర్ పాల్గొన్నారు. అనంతరం జిసిసి మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, దళారిలతో మోసపోవద్దన్నారు.కాఫీ గింజలు నాణ్యత పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు జిసిసి సన్నద్ధం చేస్తుందని ఆయన అన్నారు. కాఫీ పండ్లను సేకరించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏ ప్రాజెక్టు, కాఫీ బోర్డు అందించే కాఫీ, మిరియాల మొక్కలను అందించడం, సబ్సిడీ రుణాలు, చదువుకునే విద్యార్థులకు స్కాలర్షిప్లు, కాఫీ కల్లాలు, పల్పర్ మిషన్లు ప్రభుత్వం అందించి ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిసిసి సేల్స్ మెన్లు శ్రీదేవి, కళావతి పాల్గొన్నారు.

అనారోగ్యంతో రెండు నెలల పాప మృతి

సీలేరు వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆరోపణ

బిడ్డ మృతదేహాన్ని పట్టుకొని రోధిస్తున్న తల్లి పూర్తిమ

ప్రజాశక్తి-సీలేరు

తీవ్ర అనారోగ్యానికి గురైన రెండు నెలల పసిపాపకు సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సకాలంలో వైద్య సేవలు అందించకపోవడంతో మృతి చెందినట్లు బాధిత తల్లిదండ్రులు ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం... జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ కాలనీకి చెందిన తమ్మిని సమర, పూర్తిమ దంపతులకు రెండు నెలల క్రితం పాప జన్మించింది. ఈ చిన్నారి రెండు రోజులుగా దగ్గు, ఆయాసం, జ్వరంతో బాధపడుతూ ఆదివారం ఉదయానికి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆ సమయంలో తండ్రి లేకపోవడంతో తల్లి పూర్తిమ గ్రామంలో ఉన్న ఆశా వర్కరుకు చిన్నారి అనారోగ్య పరిస్థితి తెలియజేసింది. దీంతో ఆమె వెంటనే అంబులెన్స్‌ను రప్పించి బంధువుల సహకారంతో సీలేరు ప్రభుత్వాసుపత్రికి మధ్యాహ్నం 12 గంటలకు తీసుకొచ్చారు. ఆ సమయానికి ఆసుపత్రుల్లో వైద్యాధికారులు ఎవరూ లేరు. స్టాఫ్‌నర్సు దేవి ఓపి సీటు రాయకుండా, ఎటువంటి వైద్య సేవలు అందించకుండా, డాక్టర్లు లేరని, చింతపల్లి గాని, చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికిగాని తీసుకెళ్లి చిన్నపిల్లల డాక్టరుకు చూపించాలని సలహా ఇచ్చారు. రిఫరల్ మాత్రం రాయలేదు. దీంతో వారు సీలేరులోని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించగా చిన్నపిల్లల డాక్టర్లకు చూపించాలని వారు సూచించారు. ఏం చేయాలో తెలియక పాపను ఇంటికి తీసుకెళ్లిపోయారు. పాప పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో వేరే ఊరులో బంధువుల ఇంటికి వెళ్లిన తండ్రి సమరకు విషయం తెలియజేయడంతో ఆయన వెంటనే వచ్చి రాత్రి 10 గంటల సమయంలో సీలేరు ఆసుపత్రికి పాపను మళ్లీ తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫరల్ రాసి, గంటన్నర తర్వాత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. చిన్నారిని అంబులెన్స్‌లో చింతూరు తరలిస్తుండగా మార్గ మధ్యలో మంగంపాడు గ్రామం దాటేసరికి చిన్నారి మృతి చెందింది. దీంతో అదే అంబులెన్స్‌లో చిన్నారి మృతదేహాన్ని వారి స్వగ్రామానికి చేర్చారు.

వైద్యాధికారిని నిలదీసిన బంధువులు, కూటమి నాయకులు

బాధిత తండ్రి సుమర, వారి బంధువులు సోమవారం ఉదయం సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి, స్టాఫ్ నర్సు దేవిని నిలదీశారు. ఈ విషయంపై టిడిపి కూటమి నాయకులు చిటికెల రాము, వి.రాము, ముంది బాలుకు ఫిర్యాదు చేయడంతో వారు కూడా ఆసుపత్రికి చేరుకొని వైద్యాధికారి, స్టాఫ్ నర్స్‌ను ప్రశ్నించారు. చిన్నారికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపైనా, విధులకు హాజరు కాని వైద్యులపైనా తమ నాయకులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మృతి : తండ్రి సమర

ఈ సందర్భంగా తండ్రి సమర స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సీలేరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారులు విధుల్లో లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన చిన్నారి పాప మృతి చెందిందని ఆరోపించారు. సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి ఇద్దరు వైద్యాధికారులు ఉన్నా ఒక్కరు కూడా ఆదివారం విధులకు హాజరు కాలేదన్నారు. సకాలంలో వైద్య సేవలు అందించినా, లేదంటే వెంటనే రిఫరల్ రాసి సకాలంలో అంబులెన్స్ ఏర్పాటు చేసినా తమ పాప చనిపోయేది కాదని తన గోడును వెల్లబుచ్చారు.

కూటమి నాయకునికి తెలియజేస్తున్న బిడ్డ తండ్రి, బంధువులు

ఎటువంటి నిర్లక్ష్యం వహించలేదు : వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి

ఈ సంఘటనపై సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లిని స్థానిక విలేకరులు వివరణ కోరగా ఆసుపత్రికి తీసు కొచ్చిన చిన్నారిని చింతపల్లి లేక చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకువెళ్లి చిన్నపిల్లల వైద్యులకు చూపించాలని తమ సిబ్బంది చెప్పారన్నారు. బాధితరాలు ఇంటికి తీసుకొని వెళ్లిపోవడంతో వెళ్లి పెద్దవాళ్ళను తీసుకొని వస్తారేమోనని వేచి చూశామని, కాని రాత్రి 11.30 గంటలకు చిన్నారిని తీసుకొచ్చారని చెప్పారు. పాపను తీసుకొచ్చిన వెంటనే అంబులెన్స్ ఏర్పాటు చేసి చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించే ప్రయత్నం చేశామని, వైద్య సేవలు అందించడంలో సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యం వహించలేదని ఆయన పేర్కొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి

కళాశాలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- దేవీపట్నం

దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలని ఆదివాసీ జెఎసి నాయకులు సోమవారం తహశీల్దారు పి.రామకృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. దీనికి స్పందించిన తహశీల్దారు మాట్లాడుతూ గతంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎకరన్నర స్థలం కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐటిడిఎ ప్రత్యేక గ్రీవెన్సుకు 70 అర్జీలు

వినతులు స్వీకరిస్తున్న పిఒ అభిషేక్, ఇతర అధికారులు

ప్రజాశక్తి -పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్సుకు 70 ఫిర్యాదులు అందాయి. గిరిజన సంక్షేమ (విద్య) విభాగంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ సోమవారం వివిద మండలాల నుండి వచ్చిన ఉద్యోగుల నుండి వినతులు స్వీకరించారు. గిరిజన సంక్షేమ ఉద్యోగుల పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, పెండింగ్ జీతాలు, సర్వీసు రెగ్యులరైజేషన్, డిప్యూటేషన్లు, బదిలీలపై ఎక్కువగా ఫిర్యాదులు సమర్పించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పి.ఓ మాట్లాడుతూ, ప్రతీ నెలా మూడవ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్సు నిర్వహించి గిరిజన సంక్షేమ (విద్య) ఉద్యోగుల సమస్యలను తమ పరిధిలో ఉన్న మేరకు పరిష్కరిస్తానన్నారు. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి ఉప సంచాలకులు ఎల్.రజని, సహాయ గిరిజన సంక్షేమాధికారులు క్రాంతి కుమార్, వెంకట రమణ, మల్లిఖార్జున రావు, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

ఎం.ప్రేమ్‌సాగర్

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎం.ప్రేమ్ సాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఉషారాణి వేరే జిల్లాకు బదిలీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల భాగస్వామంతో ముందుకెళ్లి కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మార్యాద పూర్వకంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్చాలను అందజేసి అభినందించారు.

ఎవివి.కుమార్

అనంతగిరి: అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎవివి, కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు, ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండలంలోని 24 పంచాయతీ గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.గత కొంతకాలంగా మండలంలో ఎంపీడీవో గా పనిచేసిన అనుభవం ఉందని, ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో ముందడుగు వేస్తానని ఆయన పేర్కొన్నారు

బతుకమ్మ సందడి

ప్రజాశక్తి-ఉక్కునగరం : బతుకమ్మ సంబరాలలో భాగంగా సోమవారం ఐదోరోజున ఉక్కునగరంలోని ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో ఆట,పాటలతో మహిళలు సందడి చేసారు. తెలంగాణ ఉక్కు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తొలుత ఉక్కు జనరల్ మేనేజర్లు బాల కుమార్, రవి శేఖర్, ఎన్ .వీరేశం, కోటేశ్వరరావు ఎన్.కుమారస్వామి జ్యోతి ప్రజ్వలన చేశారు. సంఘం అధ్యక్షులు ఎన్. కుమారస్వామి అధ్యక్షతన మహిళలు, పిల్లలు సంప్రదాయబద్ధంగా ఆట, పాటలతో సందడి చేసారు. సంఘంప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, బి. వెంకటేశ్వర్లు , ఎన్ .నర్సింగరావు , టి.ప్రభాకర్ , ఎం కె వి ఆర్ మోహన్‌రావు , ఎం. వేణుగోపాల్ , తాండ్ర కనకరాజు, సిహెచ్ రవి కుమార్, వేణుగోపాల్ , ఎం చంద్రశేఖర్, జి .మల్లేశం , శంకర్, చంద్ర కిరణ్, బలరాం, పర మెష్ పాల్గొన్నారు.

జెడ్‌పి సిఇఒగా
నారాయణమూర్తి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా పరిషత్ సిఇఒగా పి.నారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మొన్నటి వరకు డిఎల్‌డిఒగా ఉన్న నారాయణమూర్తి కాకినాడ జెడ్‌పి సిఇఒ (ఎఫ్‌ఎసి)గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఉద్యోగోన్నతిపై విశాఖపట్నం జెడ్‌పి సిఇఒగా విచ్చేశారు. జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు
- విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించవద్దని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ హితవు పలికారు. బాల్య వివాహాల చట్టం - 2006 ప్రకారం 18 సంవత్సరాలలోపు ఆడ పిల్లలకు, 21 సంవత్సరాలలోపు మగ పిల్లలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా, హాజరైనా నిందితులే అవుతారని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో బాల్య వివాహాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయని, వాటిని ఎవరూ ప్రోత్సహించవద్దని హితవు పలికారు. ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటాయన్నారు. నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదవుతుందని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

సెయిల్‌లో విలీనం మాత్రమే స్టీల్‌ప్లాంట్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం మాత్రమే ప్రస్తుత స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారమని సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ సాగి విశ్వనాథరాజు అన్నారు. సోమవారం ఉదయం లాసన్స్ బే కాలనీలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సమస్యను పరిష్కరించేందుకు సెయిల్‌లో విలీనం చేయాలని ఇప్పటికే కేంద్ర ఉక్కు మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, స్టీల్‌ప్లాంట్ సమస్యపై నారా లోకేష్‌తో కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు సమావేశమైనప్పుడు సెయిల్ సభ్యునిగా తనను అక్కడకు ఆహ్వానించారని రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిదులంతా కలిసి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని తీర్మానించారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా టన్ను ఉక్కుకు ఉత్పత్తిపై వ్యయం తగ్గుతుందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరంలో బొగ్గు విషయంలో రూ.1200 కోట్లు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉత్పత్తికి ఎక్కడా విఘాతం కలగకుండా ఉద్యమం చేస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీకి అభినందనలు తెలిపారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలంటే సెయిల్ పాలసీలో స్వల్ప మార్పులు చేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా మంగళవారం ఢిల్లీలో స్టీల్ ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రుల మధ్య కీలక సమావేశం జరుగుతుందని ఈ వైసిపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తీసేసి అక్కడ రాజధాని భవనాలు నిర్మాణం చేయాలని ఆలోచించిందని స్వయంగా అప్పటి స్టీల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఈ విషయాన్ని వెల్లడించారని అన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా వైసిపి హయాంలో అన్నీ కల్తీ జరిగాయని, సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో సిబిఐ విచారణకు ఆదేశించడం హర్షనీయమని అన్నారు.

విశాఖ - శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవాన్ని దృష్టిలో పెట్టుకుని విశాఖపట్నం - శ్రీకాకుళం రోడ్ - విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 08529 విశాఖపట్నం - శ్రీకాకుళం రోడ్ స్పెషల్ రైలు అక్టోబర్ 10 నుంచి 16 వరకు ఉదయం 10.00 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 12.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. 08530 శ్రీకాకుళం రోడ్ - విశాఖపట్నం స్పెషల్ రైలు అక్టోబర్ 10 నుండి 16 వరకు మధ్యాహ్నం 13:30 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి మధ్యాహ్నం 15.55 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు విశాఖపట్నం - శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతాయి.

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-చింతపల్లి : రెండు దశాబ్దాలుగా కాఫీ తోటలో పనిచేస్తూ కూలి రేట్లు, పళ్ళ రేట్లు పోరాడి సాధించుకోవడం తప్ప యాజమాన్యం తమ బాగోగులు పట్టించుకోలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఐదు డివిజన్ల పరిధిలో పాడేరు, చింతపల్లి, ఆర్ వి నగర్ లలో పనిచేస్తున్న కార్మికులు ప్లాంటేషన్ లేబర్ చింతపల్లిలో సమావేశమయ్యారు. ఆందోళన చేపట్టిన రోజున కేజీ పళ్ళ ధర కిలో 20 పైసలు కాగా, రోజు కూలి రూ..63 ఉండేదని, ప్రస్తుతం కేజీ పళ్ళు రూ.5రూ, రోజు కూలి 320 రూపాయలు ఇస్తున్నారని, లేబర్ కమిషనర్ వీడియో పాయింట్లు ద్వారా చెప్పారన్నారు. ప్రస్తుతం ఏపీ ఎఫ్ డి సి కాఫీ తోటల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. ఈ పరిస్థితిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడని వాపోయారు, ఫీల్డ్ ఆఫీసర్లు, రేంజర్లు, సూపర్వైజర్లు, మొత్తం కలిపి వంద మంది పైగా సిబ్బంది ఉండేవారని, ప్రస్తుతం ఐదుగురు రేంజర్లు, 18 మంది ప్లాంటేషన్ వర్కర్లతోనే అన్ని పనులు చేయిస్తున్నారని, అది తమకు భారంగా ఉందని,ప్లాంటేషన్ వర్కర్లు లబోదిబో మంటున్నారన్నారు. ఇచ్చే వేతనం 10 వేలు మాత్రమేనని, అది వాహనాలకు పెట్రోల్ వేసుకొని తిరగడానికి సరిపోతుందని, కుటుంబాలు ఎలా గడుస్తాయని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకపోతే సిఐటియు, ఏఐటీయూసీ, సహకారంతో సమ్మెకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు. ఈనెల 15న అన్ని డివిజనల్ మేనేజర్లకు సమస్యలతో కూడిన సమ్మె నోటీసు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, ఏఐటీయూసీ జిల్లా కోకన్వీనర్ అమర్, కాఫీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎల్ సుందర్రావు, పూర్వ జిల్లా కార్యదర్శి, సిపిఎం పార్టీ గాలికొండ ఎంపీటీసీ, అంపురంగి బుజ్జిబాబు, కాఫీ కార్మిక సంఘం జిల్లా ఇన్చార్జ్, గడుతూరి సత్యనారాయణ, ప్లాంటేషన్ వర్కర్స్, రాజారావు, దేవరాజ్, మోరి గిరి, బొబ్బిలి పాపారావు, ఆర్ముగం,రాజు, కాంతారావు, మూడు డివిజన్ లలో పనిచేస్తున్న కార్మికులు, ప్లాంటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

విమ్స్‌లో అత్యాధునిక వైద్య సేవలు
డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

మాట్లాడుతున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. మూడు నెలల్లో ఉచితంగా 1016 ఎండోస్కోపీలు చేశామన్నారు. రాష్ట్రంలో ఎండోస్కోపిక్ ద్వారా న్యూరో సర్జరీలు చేస్తున్న తొలి ప్రభుత్వ ఆసుత్రిగా విమ్స్ నిలిచిందన్నారు. విమ్స్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవల వివరాలను సోమవారం మీడియాకు వివరించారు.

ఆరిలోవ ప్రాంతానికి చెందిన జగన్నాథరావు(70) బ్రెయిన్‌స్ట్రోక్‌తో పక్షవాతానికి గురికాగా, అతని కుటుంబీకులు నేరుగా విమ్స్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. న్యూరో మెడిసిన్ వైద్యులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్టు గుర్తించారు. నిరుపేద కుటుంబానికి చెందిన జగన్నాథరావు కోలుకోవడానికి రూ.55వేల విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా ఇచ్చి ఆరోగ్యం కుదుటుపడేలా చేసారు. వారం రోజుల్లోనే పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారన్నారు.

మూడు గంటల గోల్డెన్ అవర్

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారికి గోల్డెన్ అవర్‌గా మూడు గంటల సమయం ఉంటుందన్నారు. ఆ సమయం లోపల రోగికి సిటి స్కాన్ నిర్వహించి ఇంజక్షన్ చేయటం వలన ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చన్నారు. రూ 50వేల ఖర్చుతో కూడుకున్న ఈ ఇంజక్షన్ విమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు.

6 నెలలో 1016 ఎండోస్కోపీలు

ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రిలో రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు ఉండే ఎండోస్కోపీలు, కొలమస్కోపి, ఈఆర్‌సిపి, ఎండో అల్ట్రా సొనోగ్రఫీలు విమ్స్ ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఎండోస్కోపిక్ ద్వారా న్యూరో సర్జరీలు రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ లేవని, ఒక్క విమ్స్ ఆసుపత్రిలో చేస్తున్నామన్నారు.

సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో అత్యాధునిక సేవలు

సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో లాప్రోస్కోపీ ద్వారా లివర్ అండ్ బిలియారీ ట్రాక్ట సర్జరీలు, స్ప్లీనోరీనల్ స్టంట్, లాప్ స్ప్లీనెక్టమీ, గాస్ట్రెక్టమి ఎసోఫేజెక్టమీ, డిస్టల్ పాంక్రీయెక్టమీ, లాప్ కొలొరెక్టల్ ఆపరేషన్, దయాఫ్రగ్మటిక్ హెర్నియాస్ వంటి క్లిష్టమైన సర్జరీలను చేస్తున్నట్టు తెలిపారు. ఈ వైద్యసేవలను ఉత్తరాంధ్ర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కొండ గట్టు పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ : గసభ పంచాయతీ జంగిడివలస గ్రామానికి చెందిన వంతాల మోసియా (63) కొండ గట్టుపై నుంచి జారిపడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై కె పి నాయుడు తెలిపిన వివరాలు.. బాధిత గిరిజనుడు సోమవారం ఉదయం పశువులను మేతకు తీసుకెళ్లాడు, ప్రమాదవశాత్తు కొండ గట్టుపై నుంచి జారిపడి దవడ, తలపై గాయాలు కావడంతో మృతి చెందాడన్నారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఇసుక సంక్షోభంతో నిర్మాణ రంగం కుదేలు
'ఉచితం' హామీ ఏమైనట్టు ?

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

ఉక్కు రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడాలి
శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ప్రస్తుతం ఇసుక సంక్షోభం నెలకొందని, నాలుగు నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటికీ ఇసుక విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయలేకపోతోందని, ఫలితంగా నిర్మాణ రంగం కుదేలైందని శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం లాసన్స్ బే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వాకం వల్ల నిర్మాణ రంగంపై ఆధారపడిన 25 తరగతులవారు ఉపాధి కోల్పోయి నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక ఉచితంగా ఇస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నా వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో కంటే ఎక్కువ ధరకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో టన్ను ఇసుకకు రూ.370 సినరేజ్, రూ.100 హ్యాండ్లింగ్ ఛార్జ్, రూ.5 జిఎస్‌టి కలిపి రూ.475 చెల్లిస్తే లారీలో ఇసుక సరఫరా చేసేవారని బొత్స అన్నారు. కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటిస్తున్న నేపథ్యంలో సినరేజ్ ఛార్జీలు రూ.3500 తగ్గించి, కనీసంగా 10 టన్నుల ఇసుకను రూ.10 వేలకే సామాన్యునికి అందుబాటులోకి తేవాలని అన్నారు. నిత్యావసరాల ధరలు మండుతున్నా ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదని అన్నారు. కిలో కందిపప్పు ధర రూ.155 నుంచి రూ.160, రిఫైండ్ ఆయిల్ లీటర్ రూ.130 నుంచి రూ.140, లీటర్ పామాయిల్ రూ.120, కేజీ బియ్యం ధర రూ.65కు చేరిందని వెల్లడించారు. ప్రతి సరుకు మీద కనీసం రూ.25 నుంచి రూ.30 వరకు ధర పెరిగిందన్న ఆయన ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని, రవాణా ఛార్జీలు భరించి, టోకు ధరకు ప్రజలకు అందించాలని కోరారు. రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి నిత్యావసరాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో తమ ప్రభుత్వం కుదరదంటే ఆ ప్రక్రియను నిలిపివేశారని బొత్స అన్నారు. ఇప్పుడు ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్ భాగస్వాములు కాబట్టి వెంటనే ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, ఆ బాధ్యత వారిపై ఉందని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రాష్ట్ర ప్రజలకు సెంటిమెంట్‌తో కూడినందున దాని ఔన్నత్యాన్ని కాపాడాలని తేల్చి చెప్పారు. మరోవైపు గత మార్చిలో విశాఖ పోర్టులో 25 వేల కిలోల డ్రగ్స్ కంటైనర్‌ను సిబిఐ అధికారులు పట్టుకున్న విషయాన్ని గుర్తు చేసిన ఆయన ఆ కంటైనర్ పురంధేశ్వరి బంధువులదని అప్పట్లో ప్రచారం జరిగిందని ప్రస్తావించారు. గరుడ ఆపరేషన్‌లో భాగంగా వచ్చిన డ్రగ్స్ కంటైనర్ కేసును ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. డ్రగ్స్ పట్టుబడిన తర్వాత సిబిఐ ఏమైందని నిలదీశారు. దీనిపై సిఎం, డిజిపితో పాటు సిబిఐకి కూడా లేఖ రాస్తామని చెప్పారు. రైల్వే జోన్ విషయంలో గత ప్రభుత్వంలోనే భూకేటాయింపు జరిగినా, ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని బొత్స అన్నారు. సిఎం చంద్రబాబు ఈసారి ఢిల్లీ పర్యటనలోనైనా రైల్వే జోన్ శంకుస్థాపనకు ముహూర్తం పెట్టుకుని వస్తారని ఆశిస్తున్నామన్నారు. విశాఖ కేంద్రంగా డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఉండాలన్నది తమ అభిమతమని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చే ప్రజా వినతులకు సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని, అవసరమైతే ప్రజలతో నేరుగా మాట్లాడాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేసులు రీ-ఓపెన్ కావడానికి వీలులేదన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత గడువులో ఆడిట్ నిర్వహించుకోవాలని, సమీక్షించుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. కోర్టు కేసులు, పిజిఆర్ఎస్, ఇంటర్ డిపార్టుమెంటల్ అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి నిమిషంలో కాకుండా ముందు నుంచే ప్రజా ఫిర్యాదులపై స్పందించాలని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మండల స్థాయి అధికారులు గ్రీవెన్స్ డే నాడు తప్పకుండా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి వినతులు స్వీకరించి మండల స్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. సిఎంఒలో నమోదు అయ్యే ఫిర్యాదులపై కూడా నిర్ణీత కాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల పరిధిలో నమోదైన కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, త్వరితగతిన స్పందించాలని చెప్పారు. పెండింగ్ అంశాలపై ఈ నెల 31లోగా కౌంటర్ ఫైల్స్ దాఖలు చేసి నివేదిక అందించాలని, ఈ - ఆఫీసు విధానం ఫాలో అవ్వాలని సూచించారు. ఇంటర్ డిపార్టుమెంటల్ ఇష్యూపై మాట్లాడిన కలెక్టర్ సమస్యలుంటే పరిష్కరించుకోవాలని, పరస్పరం సహకారం అందించుకొని ముందుకు సాగాలని హితవు పలికారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు వివిధ సమస్యలపై 208 వినతులు సమర్పించారు. వాటిలో 91 రెవెన్యూవి ఉండగా, జివిఎంసికి చెందినవి 73, పోలీస్ విభాగానికి సంబంధించినవి 15, ఇతర శాఖలకు చెందినవి 29 ఉన్నాయి. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖపట్నం ఆర్‌డిఒ పి.శ్రీలేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 వినతులు

ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనరు ఎస్ఎస్.వర్మ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు.

లక్ష్యాలను సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని గిరిజన విద్యార్థులు శక్తివంతులు, చురుకైన వారని, వారికి క్రీడా సంబంధిత అంశాలలో ఆశక్తి ఎక్కువగా ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో గిరిజిన సంక్షేమ శాఖ, యోగా మాస్టర్ ట్రైనీలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, యోగ సాధనతో విద్యార్థులు వారి వారి లక్ష్యాలను సాధించే విధంగా తీర్చి దిద్దాలని సూచించారు. విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న శక్తిని బయటకి తీయాలని, వారిలో ఆ శక్తిని గుర్తించి అందుకు అనుగుణంగా వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. దీంతో వారిలో క్రమశిక్షణ పెరిగి మంచి పౌరులుగా మారతారని తెలిపారు. యోగ సాధనను పైలట్ ప్రాజెక్ట్‌గా పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాలలో అన్ని పాఠశాలలలో అమలు చేయాలని సూచించారు. యోగ సాధనతో పాటు సూర్య నమస్కారాలు నేర్పించాలని, తద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలోపేతం కావడమే కాకుండా వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకుంటారని కలెక్టర్ వివరించారు. యోగ సాధనతో 40 రోజులల్లోనే విద్యార్థులలో మార్పులు చూడగలమని చెప్పారు. మాస్టర్ ట్రైనీలు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్వంత కార్యక్రమంలా భావించి యోగ సాధన, సూర్య నమస్కారాలు నేర్పించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ ఉప సంచాలకులు ఎల్.రజని, పలువురు పిఇటిలు, యోగా మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు సత్కారం

శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చింతపల్లి: కొమ్మంగి పంచాయతీ కార్యదర్శిగా కొరుప్రోలు శ్రీనివాస్ అందించిన సేవలు ఎనలేనివని ఆ పంచాయతీ సర్పంచ్ పాంగి లక్ష్మి, సచివాలయ కన్వీనర్ పాంగి గుణబాబు కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ బదిలీ కావడంతో కొమ్మంగి సచివాలయ సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ, గ్రామాలలో ఏ సమస్య తలెత్తినా స్పందించి పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఉద్యోగులకు బదిలీ అనేది సర్వసాధారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లకే సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు జర్త రూతు, వార్డు సభ్యులు మరియమ్మ, రాములమ్మ, మాజీ ఉపసర్పంచ్ ఈశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనుబాబు, వైసీపీ నాయకులు అప్పన్న, లింగన్న దొర, లకే చినబాబు, వివో చిలకమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఆదర్శంగా భీమిలి

ప్రజాశక్తి-ఆనందపురం: గ్రీవెన్స్ సమస్యల పరిష్కారంలో భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలబెడతామనిఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొని, స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతిసోమవారం నియోజకవర్గంలోని ఏదోఒక చోట ఆకస్మికంగా సందర్శించి, గ్రీవెన్స్‌లో పాల్గొంటానన్నారు.ప్రజల అర్జీల పరిష్కారానికి అధికారులు జవాబుదారీగా పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. మండల పరిధిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా అధికారులను సంసిద్ధులను చేస్తానన్నారు. అర్జీల పరిష్కారానికి తాను పర్యవేక్షణ బాధ్యతను స్వీకరిస్తానన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అఖండ మెజార్టీనిచ్చి గెలిపించారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌లో అన్ సర్వేడ్ భూసమస్య పరిష్కరించాలని, పిహెచ్‌సిని సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేయాలని, అన్నక్యాంటీన్ ఏర్పాటుచేయాలని తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు కోరారు.. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ వి. జానకి, తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపిపి మజ్జి శారద ప్రియాంక, పంచకర్ల సందీప్, గాడు వెంకటప్పడు పాల్గొన్నారు.

రైల్వే బాక్సింగ్ ఛాంపియన్ షిప్ విజేత ఈస్ట్ కోస్ట్ రైల్వే

బాక్సింగ్ విజేతలను అభినందిస్తున్న రైల్వే జనరల్ మేనేజర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల ముగిసిన ఆల్ ఇండియా ఇంటర్ రైల్వే బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో ఈస్ట్ కోస్ట్ రైల్వే అద్భుత ప్రదర్శన కనబరిచి నాలుగు ప్రతిష్టాత్మక పతకాలు గెలుచుకుంది. పురుషుల జట్టు రెండు రజత పతకాలు సాధించగా, మహిళల జట్టు ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించి జాతీయ వేదికపై ప్రతిభ చాటింది. ఈ విషయాన్ని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ సోమవారం మీడియాకు తెలిపారు. అంతేకాకుండా వారి ప్రతిభకు తార్కాణంగా పురుషుల జట్టు నుంచి ముగ్గురు, మహిళల జట్టు నుంచి ముగ్గురు మొత్తం ఆరుగురు క్రీడాకారులు జాతీయ బాక్సింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ భువనేశ్వర్‌లో బాక్సర్లను వ్యక్తిగతంగా సన్మానించారు. రైల్వేకు, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నవంబర్ 23, 24 తేదీల్లో మిలటరీ ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేవీ వీక్ సెలబ్రేషన్స్ 2024లో భాగంగా 13వ ఎడిషన్ మిలిటరీ ఫొటో ఎగ్జిబిషన్ కొచ్చిలోని సదరన్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో నవంబర్ 23, 24 తేదీల్లో జరుగనుందని నిర్వాహకులు విశాఖలో సోమవారం తెలిపారు. ఎర్నాకుళం ప్రెస్ క్లబ్ సహకారంతో ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. ఫొటో జర్నలిస్టులు రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని సాయుధ దళాలలో జరిగిన సంఘటనలకు సంబంధించిన ఛాయాచిత్రాలను సమర్పించాలని ఈస్ట్ కోస్ట్ నేవీ అధికారులు తెలిపారు. 20 నవంబర్ 23 నుంచి 31 అక్టోబర్ 24 వరకు తీసిన ఫొటోలను పోటీకి పంపాలని, ప్రతి ఫొటో జర్నలిస్ట్ ఈ కాంటెస్ట్ కోసం గరిష్టంగా మూడు ఫొటోలను పంపవచ్చని తెలిపారు. ఫొటోలను sncm-phex24@gmail.comకు మెయిల్ చేయాలని తెలిపారు. ఈ పోటీలో మొదటి బహుమతి విజేతకు రూ.15000, ద్వితీయ, తృతీయ బహుమతి విజేతలకు వరుసగా రూ.7000, రూ.5000 నగదు బహుమతి అందజేస్తామన్నారు. నవంబర్ 24న కొచ్చిలోని సెంటర్ స్క్వేర్ మాల్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో ఈ పోటీల విజేతలను ప్రకటిస్తారని తెలిపారు.

నిధి పోర్టల్ ద్వారా ఎపిజిఎల్ఐ సేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిధి పోర్టల్ ద్వారా ఎపిజిఎల్ఐ (ఆంధ్రప్రదేశ్ సాధారణ జీవిత భీమా) సేవలను పొందాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎపిజిఎల్ఐ సంయుక్త సంచాలకులు ఎం.ఝాన్సీలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఎపిజిఎల్ఐ జీవిత బీమా సేవలు అందిస్తోందని గుర్తు చేశారు. దానిలో భాగంగా మే నెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎపిజిఎల్ఐ సేవలు ఆఫ్ లైన్ నుంచి నిధి పోర్టల్‌కు బదలాయింపు జరిగాయని, ఈ విషయాన్ని పాలసీదారులు గుర్తించి సేవలను ఆన్‌లైన్‌లోనే పొందాలని సూచించారు. మే 24 నుంచి నేటి వరకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోగల ఎపిజిఎల్ఐ పాలసీదారులకు చెందిన 1,368 పరిణితి, మరణ క్లైములు, 503 ఐడి దరఖాస్తులను ఆమోదించి వారి డిడిఒల నిధి పోర్టల్ లాగిన్‌కు పంపించినట్లు తెలిపారు. డిడిఒలు నిధి పోర్టల్ లాగిన్‌కు వచ్చిన ఆమోదిత క్లెయిమ్‌లు, రుణ చెల్లింపుల కోసం సిఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లు జనరేట్ చేసి, సబ్మిట్ చేయవలసి ఉందని ప్రకటనలో స్పష్టం చేశారు. అదేవిధంగా ఉద్యోగి బేసిక్ పే స్లాబ్ రేట్ ప్రకారం మొదటి పాలసీ బాండ్‌ను వారి కార్యాలయ డిడిఒ నిధి లాగిన్‌లో మాత్రమే జనరేట్ చేయాలని, వారి ప్రీమియంను మొదట నెల జీతం బిల్లులో రికవరీ పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. పాలసీదారులకు వారి నిధి పోర్టల్ లాగిన్‌లో బేసిక్ పేలో 15 శాతం వరకు స్వచ్ఛందంగా పెంచుకొనే సౌలభ్యం ఉందని తెలిపారు. అలాగే ఎపిజిఎల్ఐ కార్యాలయం త్వరలోనే జిల్లా పరిషత్ సమీపంలోని ఇంటిగ్రేటెడ్ కమర్షియల్ కాంప్లెక్స్ భవనానికి మారనుందని తెలిపారు.